సాక్షి నాగర్‌కర్నూల్

ఆదివారం । 1 । సెప్టెంబర్‌ । 2024



కృష్ణమ్మ పరవళ్లు

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది.

వివరాలు 8లో ▸



వర్షానికి కూలిన ఇళ్లు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మట్టి ఇళ్లు కూలిపోయాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 32.8 /21.2

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

9 నుంచి సదరం క్యాంపులు

నాగర్‌కర్నూల్‌ క్రైం: జిల్లా జనరల్‌ ఆస్పత్రిలో ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలత్వ నిర్ధారణ పరీక్షలకు హాజరయ్యే వారు ఈ నెల 3వ తేదీలోగా మీసేవ కేంద్రంలో స్లాట్‌ బుక్‌ చేసుకోవాలని సూచించారు. శారీరక దివ్యాంగులకు 9, 12, 16, 23 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వినికిడి లోపం ఉన్న వారికి 4, 11 తేదీల్లో, కంటిచూపు లోపం వారికి 9, 23 తేదీల్లో, మానసిక దివ్యాంగులకు 12, 19 తేదీల్లో సదరం క్యాంపులు ఉంటాయని తెలిపారు. క్యాంపులకు వచ్చే వారు మీసేవ స్లాట్‌ బుకింగ్‌ రసీదుతో పాటు ఆధార్‌, ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

శనేశ్వరాలయానికి భక్తుల తాకిడి



నాగర్‌కర్నూల్‌ (బిజినేపల్లి): రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ నందివడ్డెమాన్‌ శనేశ్వరాలయానికి భక్తుల తాకిడి తగ్గలేదు. శనివారం శనిత్రయోదశి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శనిదోష నివారణ పూజల కోసం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మంత్రోచ్చారణల మధ్య జ్యేష్ఠాదేవి సమేత శనేశ్వరుడికి తిలతైలాభిషేకాలు చేశారు. అనంతరం శివాలయంలో రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శాంతికుమార్‌, ఉమామహేశ్వర్‌, మల్లికార్జున్‌ పాల్గొన్నారు.

భూగర్భ జలవిద్యుత్‌ కేంద్రం సీఈగా రామసుబ్బారెడ్డి



దోమలపెంట: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్‌ కేంద్రం సీఈగా రామసుబ్బారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఈగా పనిచేస్తున్న సూర్యనారాయణ పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో జూరాల ఎస్‌ఈగా పనిచేస్తున్న రామసుబ్బారెడ్డిని పదోన్నతిపై శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్‌ కేంద్రం సీఈగా నియమించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఇంజినీర్లు నూతన సీఈ, పదవీ విరమణ పొందిన సీఈని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

3న బహిరంగ వేలం

నాగర్‌కర్నూల్‌ క్రైం: జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3న పాత బ్యాటరీలు, టైర్ల వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గైక్వాడ్‌ వైభవ్‌ రఘునాథ్‌ శనివారం ప్రకటనలో తెలిపారు. పోలీస్‌ హెడ్‌క్వార్టర్స్‌లో ఉదయం 11గంటలకు వేలం ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు 87126 57705 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



కోడేరు-పసుపుల మార్గంలో ప్రవహిస్తున్న వాగు



సిర్సవాడ వద్ద పారుతున్న దుందుభీ వాగు

జోరువాన

జిల్లావ్యాప్తంగా 52.3 మి.మీ. వర్షపాతం నమోదు

మండలాల వారీగా వర్షపాతం వివరాలు (మి.మీ.)లలో..

మండలం	వర్షపాతం
పెద్దకొత్తపల్లి	100.4
తిమ్మాజిపేట	86.4
లింగాల	84.6
కోడేరు	81.4
నాగర్‌కర్నూల్‌	69.8
బిజినేపల్లి	65.2
కల్వకుర్తి	63.4
అచ్చంపేట	60.4
కొల్లాపూర్‌	60.4
బల్మూర్‌	59.4
అమ్రాబాద్‌	54.6
తాడూర్‌	46.4
ఊర్కొండ	41.8
పదర	36.8
తెలకపల్లి	52.6
ఉప్పునుంతల	28.6
పెంట్లవెల్లి	22.4
వంగూర్‌	14.0
వెల్దండ	10.2
చారకొండ	7.4



జిల్లా కేంద్రంలో జలమయమైన బీసీ కాలనీ

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- చెరువులు, కుంటలకు జలకళ

కల్వకుర్తి టౌన్‌: జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమైన వర్షం.. శనివారం విరామం లేకుండా కురిసింది. భారీ వర్షంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షపునీరు వచ్చి చేరుతోంది. పలు చెరువులు, కుంటలతో పాటు చెక్‌డ్యాంలు అలుగులు పారుతున్నాయి. రోడ్లన్నీ జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉధృతంగా పారుతున్న వాగులను ఎవరూ దాటకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు కంచెలను ఏర్పాటు చేశారు. జిల్లాలో సగటున 52.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పెద్దకొత్తపల్లి మండలంలో 100.4 మి.మీ. వర్షపాతం నమోదు కాగా.. తిమ్మాజిపేటలో 86.4, లింగాల మండలంలో 84.6 మి.మీ. వర్షం పడింది. నాగర్‌కర్నూల్‌, బిజినేపల్లి, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్‌ మండలాల్లో 60 మి.మీ. పైగా వర్షపాతం నమోదైంది. మరో రెండు, మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు రెడ్‌ అలర్ట్‌ ప్రకటించారు. దీంతో పాత మట్టి ఇళ్లు, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. విద్యుత్‌ సమస్య ఏర్పడితే స్వతహాగా ఎలాంటి మరమ్మతు చేయరాదని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

■ జిల్లా కలెక్టర్‌తో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించి పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురిచే అవకాశం ఉన్నందున అప్రమతంగా ఉండాలన్నారు. వర్షానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని తెలిపారు. జిల్లాకు రెడ్‌ అలర్ట్‌ ప్రకటించటంతో విద్యా సంస్థలకు సెలవులు, ఇతర విషయాలపై సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.



కల్వకుర్తి మండలం పంజుగులలో నేలకూలిన చెట్టు

■ అచ్చంపేట మండలంలోని ఉమామహేశ్వరం వద్ద పారుతున్న జలపాతానికి కొండచరియలు విరిగిపడే అవకాశం ఉండటంతో భక్తులను అనుమతించడం లేదు. కల్వకుర్తి మండలంలోని పంజుగుల ప్రభుత్వ పాఠశాల వద్ద వేపచెట్టు విరిగిపడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రఘుపతిపేట వద్ద దుందుభీ వాగు ఉధృతంగా పారుతోంది. ఊర్కొండ మండలంలోని మాధారం నుంచి సిర్సవాడకు వెళ్లే దారిలో దుందుభీ వాగు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెన్నచెర్లలో వెంకటయ్య అనే వ్యక్తి ఇంటి పైకప్పు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లింగాల మండలంలోని పద్మన్నపల్లి వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోడేరు-పసుపుల మార్గంలో, బల్మూరు మండలంలోని బాణాల వాగు ఉధృతంగా ప్రవహించటంతో రాకపోకలు నిలిచిపోయాయి.



జిల్లా కేంద్రంలో జలమయమైన ప్రధాన రహదారి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌

నాగర్‌కర్నూల్‌: మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్‌ అలర్ట్‌ ప్రకటించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌ ఆదేశించారు. శనివారం రెవెన్యూ, పంచాయతీరాజ్‌, నీటిపారుదల, విద్యుత్‌ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉంటూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వాటిల్లకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువులు, కుంటలు తెగిపోవడానికి అవకాశం ఉన్న వాటిని గుర్తించి, తగు జాగ్రత్తలు చేపట్టాలని ఇరిగేషన్‌ ఇంజినీర్లకు సూచించారు. రోడ్లపై కల్వర్టులు కోతకు గురైతే అటువైపు ఎవరూ వెళ్లకుండా కంచె ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న మట్టి ఇళ్లను గుర్తించి కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని కోరారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు. అదేవిధంగా పశువుల మేతకు చెరువులు, నదులను దాటవద్దని కోరారు. ముఖ్యంగా కృష్ణానది పరివాహక సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాన్‌ దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్‌ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఏదేని సమస్య ఏర్పడితే కంట్రోల్‌రూం నంబర్‌ 08540–230201తో పాటు ఆయా మండలాల తహసీల్దార్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్లు కె.సీతారామారావు, దేవసహాయం తదితరులు ఉన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్‌ క్రైం: పెండింగ్‌ కేసుల పరిష్కారానికి విచారణ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌ బాబు సూచించారు. శనివారం జిల్లా కోర్టులో న్యాయమూర్తులు, పోలీసు, ఎక్సైజ్‌ శాఖల అధికారులతో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. కేసుల పరిష్కారంలో విచారణ అధికారుల పాత్ర కీలకమని, అందుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో ఉన్న పెండింగ్‌ కేసులను త్వరగా పరిష్కరించాలని అన్నారు. విచారణ అధికారులు విధిగా కోర్టుకు హాజరయ్యేలా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో క్రిమినల్‌ కేసులు 7,654 పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారంపై పోలీసు, ఎక్సైజ్‌ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా పరిష్కరించే కేసులకు సంబంధిత విచారణ అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. అనంతరం కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌, అచ్చంపేట కోర్టుల్లో పెండింగ్‌ కేసులపై వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్‌ అదాలత్‌లో 17వేల కేసులు పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్‌ జూనియర్స్‌ సివిల్‌జడ్జి పి.మౌనిక, మొదటి జూనియర్‌ జడ్జి మమతారెడ్డి, రెండవ జూనియర్‌ జడ్జి శ్రీనిధి ఉన్నారు.

జీవన విధానంలో రాజ్యాంగం ముఖ్యపాత్ర

నాగర్‌కర్నూల్‌ (బిజినేపల్లి): దేశ ప్రజల జీవన విధానంలో రాజ్యాంగం ప్రముఖ పాత్ర పోషిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు అన్నారు. బిజినేపల్లి మండలంలోని పాలెం వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులపై విద్యార్థి దశ నుంచే అందరికీ అవగాహన ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండని బాలిక అంగీకారంతో లైంగిక చర్యకు పాల్పడిన వ్యక్తిని చట్టం శిక్షిస్తుందన్నారు. బాధిత బాలిక మానసిక, శారీరకంగా ఎదగకపోవడం ద్వారా తాను తీసుకున్న నిర్ణయం సరైందా కాదా అనే అవగాహన ఉండదన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అంతేగాక ఉచితంగా న్యాయ సహాయం పొందడానికి ప్రత్యేక సెల్‌ ఉంటుందని.. పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సబిత, ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఫార్మసీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: పీయూ పరిధిలో బీఫార్మసీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఫార్మసీ కళాశాలలో జరుగుతున్న 4వ సెమిస్టర్‌ పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రశ్నపత్రాల్లో సమస్యలు ఉంటే చీఫ్‌ సూపరింటెండెంట్‌కు చెప్పాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్‌ నూర్జహాన్‌ తదితరులున్నారు.

గ్యాలరీ నిర్మాణానికి భూమిపూజ

పాలమూరు యూనివర్సిటీలోని సింథెటిక్‌ ట్రాక్‌లో గ్యాలరీ నిర్మాణానికి రిజిస్ట్రార్‌ మధుసూదన్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంటర్‌ రిజిస్ట్రార్‌ వెంకటేశ్వర్లు, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిజిస్ట్రార్‌ మధుసూదన్‌రెడ్డి

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు



మన్ననూర్‌లో ఏటీసీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మన్ననూర్‌: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాభివృద్ధితోనే అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. మన్ననూర్‌ ఆర్‌ఐటీఐ కళాశాలలో రూ. 4.5 కోట్లతో ఏటీసీ (అడ్వాన్స్‌డ్‌ టెక్నాలజీ సెంటర్‌) నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్కిల్‌ డెవలప్‌మెంట్‌లో అడ్వాన్స్‌డ్‌ టెక్నాలజీ సెంటర్‌ ఒక భాగమని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అందులో భాగంగా ఏటీసీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అందుకు సంబంధించిన యూనివర్సిటీని రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో రూ. వెయ్యి కోట్లతో స్థాపిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 17 కోర్సులు ఉంటాయని.. ప్రతి ఏటా 2 వేల నుంచి 5వేల మంది యువతీ యువకులకు శిక్షణ ఇచ్చి నైపుణ్యవంతులను చేస్తారన్నారు. అదేవిధంగా కార్పొరేట్‌ కంపెనీలు, ప్రైవేటు సంస్థల సహకారంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఏటీసీలో 6 కోర్సుల్లో శిక్షణకుగాను రూ. 35 కోట్లు ఖర్చుచేసి యంత్ర పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఏటీసీకి కొత్తగా వచ్చిన వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఐటీఐ కళాశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్‌ లక్ష్మణ స్వామిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హఫీజ్‌, ఫరూక్‌, హరినారాయణ, రహీం, వెంకటరమణ, శ్రీనివాసులు, రాజారాం, మేరాజ్‌, సత్యనారాయణ, లోకనాథం, కర్ణయ్య పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై కసరత్తు..

- క్షేత్రస్థాయి సర్వేకు సన్నద్ధమవుతున్న అధికారులు
- మున్సిపాలిటీల్లో సమస్యల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు
- ప్రభుత్వ భూములు, చెరువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి
- జిల్లావ్యాప్తంగా 67,603 దరఖాస్తులు



కల్వకుర్తి మున్సిపల్‌ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల కోసం హెల్ప్‌డెస్క్‌ ప్రారంభించిన అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్‌: జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిష్కారానికి కసరత్తు మొదలైంది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అందుకోసం మున్సిపాలిటీల్లో టౌన్‌ ప్లానింగ్‌, రెవెన్యూ, ఇరిగేషన్‌ అధికారుల సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేస్తున్నారు. మూడు నెలల్లోగా పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులను పూర్తిచేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించడంతో, అందుకు అనుగుణంగా అధికారులు సన్నద్ధమవుతున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనే కీలకం..

సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులు ఉన్నతాధికారుల ఆమోదం పొందనున్నాయి. మున్సిపాలిటీల్లో టౌన్‌ ప్లానింగ్‌, రెవెన్యూ, ఇరిగేషన్‌ అధికారులు దరఖాస్తుకు సంబంధించిన స్థలాన్ని ప్రత్యక్షంగా సందర్శించాలి. క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్టు ఫొటోను ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేస్తేనే దరఖాస్తు పరిష్కారానికి నోచుకోనుంది. జిల్లా వ్యాప్తంగా నాలుగు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో మొత్తం 67,603 దరఖాస్తులు ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారానికి అధికారులు ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టారు. ముందుగా దరఖాస్తుల్లో డాక్యుమెంట్లు, ఆధారాలు లేని వాటిని గుర్తించి, సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం దరఖాస్తు చేసుకున్న స్థలం డాక్యుమెంట్లు ఉన్నట్లు నిర్ధారణ తర్వాతే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టనున్నారు.

■ ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలా, మురుగుకాల్వలు, నీటి ప్రవాహాల సంరక్షణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అధికారులు ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించనున్నారు. ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి చెరువులు, నాలాలు ఆక్రమణకు గురయ్యాయా లేదా అన్నది పరిశీలిస్తారు. ఒకవేళ ప్రభుత్వ, చెరువులకు సంబంధించిన భూములుగా తేలితే దరఖాస్తులను తిరస్కరిస్తారు. మున్సిపాలిటీల్లోని చెరువుల ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్‌ పరిధిలోని లేఅవుట్లను తిరస్కరించనున్నారు.

హెల్ప్‌డెస్క్‌ల ద్వారా ప్రక్రియలో వేగం..

నిర్ణీత సమయంలోగా ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో పాటు పరిమిత సంఖ్యలో సిబ్బంది ఉండటంతో ఈ ప్రక్రియ పూర్తిచేయడంపై సందిగ్ధం నెలకొంది. ఈ క్రమంలో మున్సిపాలిటీల పరిధిలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు ఆయా మున్సిపల్‌ కార్యాలయాల్లో అధికారులు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దరఖాస్తుదారులు తమ ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులతో పాటు రిజిస్టర్‌ డాక్యుమెంట్లు, ఇతర ఆధారాలను హెల్ప్‌డెస్క్‌ల వద్ద సమర్పించాలని అధికారులు చెబుతున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే ఆమోదం..

మున్సిపాలిటీలోని ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. ముందుగా సరైన డాక్యుమెంట్లు లేని దరఖాస్తుదారులను గుర్తించి ఆధారాలు చూపాలని తెలియజేస్తున్నాం. టీపీఓ, రెవెన్యూ అధికారుల ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టిన తర్వాతే దరఖాస్తులను పరిష్కరిస్తాం.

– నరేశ్‌, మున్సిపల్‌ కమిషనర్‌, నాగర్‌కర్నూల్‌

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


లక్ష్మారెడ్డి (ఫైల్)

దేవరకద్ర: గోప్లాపూర్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. బండర్‌పల్లికి చెందిన లక్ష్మారెడ్డి(40) బైక్‌పై దేవరకద్ర నుంచి గ్రామానికి వెళ్తుండగా గోప్లాపూర్ దాటిన తరువాత ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో అతడు రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన లారీ లక్ష్మారెడ్డిపై నుంచి వెళ్లింది. దీంతో శరీరం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణం అయిన లారీపై ఆరా తీసినట్లు వివరించారు.

బీటెక్ విద్యార్థి మృతితో విషాదఛాయలు

ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన బీటెక్ విద్యార్థి తోళ్ల శివరామకృష్ణ యాదవ్ (19) శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నం.. యాచారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మండలకేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా విద్యార్థి ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదివేవాడని స్థానికులు తెలిపారు. అక్కడే తన స్నేహితులతో కలిసి ప్రైవేట్ హాస్టల్‌లో ఉండేవాడని వివరించారు. తన స్నేహితుడి గ్రామంలో బోనాల పండుగ నిమిత్తం బైక్‌పై వెళ్లి తిరిగి ఇబ్రహీంపట్నం వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడని పేర్కొన్నారు. శివరామకృష్ణతో పాటు తోళ్ల లలిత, కృష్ణయ్య దంపతులకు ఓ కుమార్తె ఉన్నట్లు వివరించారు. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా శనివారం సాయంత్రం శివరామకృష్ణ మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

మృతదేహం లభ్యం

వనపర్తి రూరల్: తోమాలపల్లి శివారులోని జూరాల ప్రధాన కాల్వలో శుక్రవారం గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హైదరాబాదుకు చెందిన జాదవ్ అంకిత్ కుమార్ శుక్రవారం జూరాల ప్రధాన కాల్వలో గల్లంతయ్యాడు. శనివారం శ్రీ రంగాపురం మండలం.. నాగసానిపల్లి శివారులోని కాల్వ బిడ్జి దగ్గర అతడి మృతదేహం కంప చెట్లకు తగులుకొని ఉండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని హోంగార్డు మాలిక్ సాయంతో అతికష్టం మీద తాళ్లతో బయటికి తీశారు. అనంతరం వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

మాగనూర్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. బాలిక(16) శుక్రవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లి వస్తానని ఇంట్లో తల్లికి చెప్పి వెళ్లిందన్నారు. ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఇళ్లలోతో పాటు సమీప బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదని అన్నారు. ఈ మేరకు శనివారం ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బ్రాహ్మణ యువతకు ప్రాధాన్యత కల్పించాలి

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలో బ్రాహ్మణ యువతకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని బ్రాహ్మణ యువ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రమోద్‌కోటార్ అన్నారు. శనివారం వారు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటిస్తూ.. అదే రోజు రాత్రి అలంపూర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు బ్రాహ్మణ యువతతో సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ యువత అన్ని రంగాల్లో ఉత్సాహంగా ఉండాలని అన్నారు. ఇటీవల తాను సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని, బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలియజేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లోని పాలకమండలితో పాటు మార్కెట్‌యార్డు, గ్రంథాలయ సంస్థల్లో బ్రాహ్మణ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. బ్రాహ్మణులు ఆధ్యాత్మికతతో పాటు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజిక రంగాల్లో ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ప్రమోద్ కోటార్‌తో పాటుగా రాఘవేంద్ర, వంశీ, రామన్న, నరసింహారావు, అనిల్, వినోద్ హరికృష్ణ, ఆనంద్ శర్మ ఉన్నారు. అంతకు ముందు వారు బీచుపల్లి దేవస్థానం అలాగే అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయం, మల్దకల్ దేవస్థానం, కురుమూర్తి, మన్యంకొండ దేవస్థానాలను కూడా సందర్శించారు.



పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ


జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టుకు 3,36,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 45 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది. వారం రోజులుగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం ఇన్‌ఫ్లో మరింత పెరిగింది. ప్రాజెక్టుకు శుక్రవారం 3.21లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శనివారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 3.36లక్షలకు పెరిగినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 45 క్రస్టు గేట్లను ఎత్తి 3,33,645 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 89, కుడి కాల్వ ద్వారా 620, ఎడమ కాల్వకు 550, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 50క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,34,688 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.145 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 1,78,574 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 1,76,618 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 117.376 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.85లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 30 గేట్లను ఎత్తి 1,78,500 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 27.767 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగడంతో దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి నిలకడగా కొనసాగుతుంది. శనివారం 5 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 125.340 మిలియన్ యూనిట్లు, దిగువలో ఇప్పటి వరకు 99.710 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 225.050 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని తెలిపారు. భారీస్థాయిలో వరద నీరు చేరుతుండడంతో కేవలం 5 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టి, ప్రస్తుతం 19 వేల క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలంకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

సుంకేసులలో ఒక గేటు ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంలో ఒక గేటు ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. శనివారం ఉదయం డ్యాం సామర్థ్యం మించి ఇన్‌ఫ్లో రాకపోవడంతో గేట్లు తెరవలేదు. సాయంత్రం ఎగువ నుంచి 3,357 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో, ఒక గేటును తెరిచి 912 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసి, 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు విడుదల చేసినట్లు జేఈ పేర్కొన్నారు.

సంగంబండ రిజర్వాయర్ 4 గేట్ల ఎత్తివేత

మక్తల్: మండలంలోని సంగంబండ వద్ద ఉన్న చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ సంగంబండ రిజర్వాయర్‌లో నీటి ప్రవాహం అధికం కావడంతో శనివారం 4 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కర్ణాటక ఇడ్లూర్ పెద్దవాగు నుంచి నీటి ప్రవహం అధికంగా వస్తుండగా సోమేశ్వర్‌బండ, ఉజ్జెల్లి, చెల్లేర్, సమీస్తాపూర్ గ్రామాలకు నీరు చేరుకుంటుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.



ఉమామహేశ్వరంలో ప్రమాద ఘంటికలు


పాపనాశిని గుండం సమీపంలో కొండ పైనుంచి వస్తున్న నీరు

- కొండ చరియలు విరిగిపడే అవకాశం

అచ్చంపేట రూరల్: నల్లమలలో రెండురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమామహేశ్వరంలోని పాపనాశిని గుండం కొండపై నుంచి వర్షపు నీరు భారీగా జాలువారుతోంది. నిత్యాన్నదాన సత్రంలోకి వర్షపు నీరు చేరింది. శనివారం భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకొని తమ సెల్‌ఫోన్‌లో ఆ చిత్రాలను బంధించడం కనిపించింది. కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని.. భక్తులు జాగ్రత్తగా ఉండాలని ఆలయ అధికారులు సూచిస్తున్నారు. వర్షాలు తగ్గాకే ఉమామహేశ్వరక్షేత్ర దర్శనం చేసుకోవాలని పోలీసు అధికారులు సామాజిక మాధ్యమాల్లో పేర్కొంటున్నారు.

రైతులకు ఇబ్బందులు రావొద్దు

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

కల్వకుర్తి: సహకార బ్యాంకులకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. శనివారం కల్వకుర్తి సహకార బ్యాంకులో డివిజన్ పరిధిలోని ఐదుగురు చైర్మన్లు, సీఈఓలతో ఆయన సమావేశమయ్యారు. కల్వకుర్తి డీసీసీబీ పరిధిలో సుమారు రూ.37 కోట్ల పంట రుణమాఫీ జరిగిందని.. ఇప్పటి వరకు రూ.3.50 కోట్లు రైతులకు చెల్లించినట్లు అధికారులు చైర్మన్‌కు వివరించారు. పంట రుణాల కోసం వచ్చే రైతులకు ఇతర బ్యాంకులు నోడ్యూ సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని చైర్మన్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. పంట రుణమాఫీ వర్తించిన రైతులకు తిరిగి రుణాలు ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ జంపా వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్లు తలసాని జనార్దన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గురువయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ రఘునాథ్‌రెడ్డి, సీఈఓలు వెంకట్‌రెడ్డి, విష్ణుమూర్తి, శ్రీనివాస్, వెంకటయ్య, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

జలదిగ్బంధంలో జడ్చర్ల ఆస్పత్రి


వరదనీటితో నిండిన ఆస్పత్రి ప్రాంగణం

జడ్చర్ల టౌన్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి స్థానిక ఏరియా ఆస్పత్రి మరోసారి జలదిగ్బంధంలో ఉండిపోయింది. శుక్రవారం రాత్రి నుంచి ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురవటంతో శనివారం మధ్యాహ్నం 3గంటల వరకు ఆస్పత్రి ప్రాంగణం వరద నీటిలోనే ఉండిపోయింది. అధికారులు చేపట్టిన సహాయక చర్యల కారణంగా మధ్యాహ్నం 3గంటల తర్వాత ప్రాంగణంలోని వరద మొత్తం బయటకు వెళ్లింది. జడ్చర్ల, కావేరమ్మపేట నుంచి వచ్చిన వరదనీరు సాఫీగా వెళ్లలేక ఆస్పత్రి వెనకాల ప్రహరి కింది నుంచి ప్రాంగణంలోకి వచ్చి చేరాయి. దీంతో ఆస్పత్రి ప్రాంగణం కాలు మోపడానికి వీలు లేకుండా ఉండింది. ఆస్పత్రి ఉల్లివాగు లోతట్టు ప్రాంతంలో నిర్మించటంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఆగస్టు 20న కురిసిన భారీ వర్షానికి ఆస్పత్రి ప్రాంగణం వరద నీటితో నిండిపోయిన విషయం పాఠకులకు తెలిసిందే. 11రోజుల తర్వాత పరిస్థితి మళ్లీ షరా మామూలే అన్నట్లుగా వరదనీరు వచ్చి చేరింది. జడ్చర్ల, కావేరమ్మపేటల్లో ఉన్న చెరువులు అలుగు పారితే ఆ వర్షపు నీరు ఉల్లివాగు ద్వారా నసురుల్లాబాద్ చెరువులోకి వెళ్తాయి. అయితే గ్రామాల్లోని చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణలకు గురికావటం, ఆస్పత్రి ఉల్లివాగు పక్కనే లోతట్టు ప్రాంతంలో నిర్మించటంతో వరదనీటి ప్రవాహానికి మార్గం లేకుండా పోయింది. దీనికి తోడు ఆస్పత్రి పై భాగాన వెలసిన వెంచర్లలో వరదనీరు వెళ్లేందుకు వేసిన పైపులు జాం కావటంతో నీళ్లన్ని వెంచర్లలో నిండిపోయాయి. ఆ నీరంతా ఆస్పత్రి ప్రహరీకి వచ్చి చేరాయి. దీంతో ప్రహరి కిందనుంచి ఆస్పత్రి ప్రాంగణంలోని నీళ్లు చేరాయి. వరదనీరు వెళ్లేందుకు నిర్మించిన కాల్వ భూమికన్నా అడుగు ఎత్తులో ఉండటంతో నీరు అందులోకి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి శనివారం తెల్లవారే సరికి ఆస్పత్రి ప్రాంగణం చెరువులను తలపించేలా మారిపోయింది. దీంతో ఆస్పత్రిలో ఉన్న రోగులు, సిబ్బంది బయటకు వెళ్లేందుకు నానా తంటాలు పడ్డారు. బయటి నుంచి రోగులు లోపలికు వరద నీటిలోనే వెళ్లాల్సి వచ్చింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సహాయక చర్యలు

స్థానిక తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజయ్య, వార్డు కౌన్సిలర్ సతీష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆస్పత్రి పైభాగాన ఉన్న వెంచర్లలో పేరుకుపోయిన కాల్వలను శుభ్రం చేయించారు. దీంతో వర్షపునీరు కాల్వ ద్వారా వెళ్లింది.

ముగిసిన చాగంటి ప్రవచనం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని చంద్రగార్డెన్‌లో నిర్వహించిన చాగంటి కోటేశ్వరరావు రెండ్రోజుల నిత్యపూజ విధానం ప్రవచనం శనివారం ముగిసింది. రెండోరోజు ఉదయం 10.30 నుంచి రెండు గంటల పాటు కొనసాగింది. ప్రతి మనిషి నిద్ర లేవగానే కాలకృత్యాలు తీర్చుకొని పూజ చేయాలని.. ఈశ్వరుడికి కృతజ్ఞత తెలియజేసిన తర్వాతే ఇతర కార్యక్రమాలు చేపట్టాలని చాగంటి వివరించారు. పూజ గది ఎంత పెద్దగా ఉంది అన్నది ముఖ్యం కాదని.. ఎంత భక్తితో చేశామన్నదే ప్రధానమన్నారు. పూజకు మనసు ప్రధానమైందని.. నిత్యపూజ విధానంలో పాటించాల్సిన నియమాలు, పఠించాల్సిన శ్లోకాలు, చేయాల్సిన నైవేద్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బి.శివకుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు చాగంటిని సత్కరించారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన


బొటానికల్ గార్డెన్‌లో బీట్‌ఆఫీసర్లు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35వ బ్యాచ్‌కు చెందిన 33 మంది ఆఫీసర్లు శనివారం సందర్శించారు. ఆఫీసర్ల బృందానికి ప్రిన్సిపాల్ సుకన్య, వృక్షశాస్త్రవిభాగం అధిపతి డా.నర్మద, గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్యలు స్వాగతం పలికారు. గార్డెన్‌ను సందర్శించి అందులో వివరాలను తెలుసుకున్నారు. గార్డెన్‌తోపాటు జీవవైవిధ్య పరిశోధనా విద్యాకేంద్రం, తెలంగాణ రాష్ట్ర హెర్బేరియం సందర్శించారు. దేశంలోనే అతిపెద్ద జెర్రిపోతు కుబుసాన్ని ఆఫీసర్ల బృందం తిలకించారు. గార్డెన్ సందర్శించిన వారిలో సమన్వయకర్త రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

ఆరు వ్యవసాయ మోటార్లు చోరీ

ఉప్పునుంతల: మండల కేంద్రంలో మెకానిక్ సైదయ్య షాపు ముందు ఉంచిన ఆరు మోటార్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అపహరించారు. వాటిలో నాలుగు బోరు మోటార్లు, ఒక ఓపెన్‌వెల్ మోటారు, ఒక బావి మోటారు ఉన్నాయి. వాటి విలువ రూ.1 లక్ష వరకు ఉంటుందని బాధితుడు షాపు యజమాని సైదయ్య తెలిపాడు. రైతుల కాలిపోయిన మోటర్లకు కొత్తగా వైండింగ్ చేసి షాపు ముందు ఉంచినట్లు తెలిపాడు. రాత్రి 11.30 గంటల వరకు షాపులో మోటారుకు వైండింగ్ చేసి నిద్రపోయినట్లు ఆయన తెలిపారు. గుర్తు తెలియని దొంగలు రాత్రి 1గంట తర్వాత వాహనంతో వచ్చి మోటార్లను తీసుకెళ్లినట్లు తెలిపాడు. ఊరి చివరన ఉన్న వైన్స్ షాపులో సీసీ కెమెరా తనిఖీ చేయగా, రాత్రి బొలెరో వాహనం అచ్చంపేట వైపు వెళ్లినట్లు కన్పిస్తున్నదని పేర్కొన్నాడు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సైదయ్య తెలిపాడు.

వర్షానికి కూలిన ఇళ్లు..


పగిడ్యాల్‌లో కూలిన ఇల్లు

పెద్దకొత్తపల్లి: భారీ వర్షాలకు మండలంలో రెండు ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ యూసుఫ్ అలీ తెలిపారు. వెన్నచెర్లలో మద్దిని వెంకటయ్య ఇల్లు శనివారం మధ్యాహ్నం కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు వేరే గదిలో ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. సాతాపూర్‌లో ఎండీ షఫీ ఇల్లు కూలగా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. శిథిల ఇళ్లు ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తహసీల్దార్ ప్రజలకు సూచించారు.

నందివడ్డెమాన్‌లో..

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని నందివడ్డెమాన్‌లో కుందేటి ఆశమ్మ అనే వృద్ధురాలి ఇంటి పైకప్పు కూలింది. దీంతో గ్రామానికి చెందిన శెట్టి రాజేష్, విష్ణువర్ధన్‌రెడ్డి బాధితురాలికి కొంత నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. వృద్ధురాలికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు.

దామరగిద్దలో పెంకుటిల్లు..

దామరగిద్ద: మండల కేంద్రంలో బాడలి సిద్ధప్పకు చెందిన పెంకుటిల్లు శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి కూలింది. ఆ సమయంలో కుటుంబమంతా పక్కన ఉన్న మరో ఇంట్లో నిద్రిస్తుండటంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోవర్ధనగిరిలో..

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో బోరెల్లి రాముడుకు చెందిన మట్టి మిద్దె కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి మిద్దె కూలిందని.. ఆ సమయంలో ఇంటి ఎదుట ఉన్న కొట్టంలో తలదాచుకోవడంతో భార్యాపిల్లలతో బయటపడ్డానని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.


వెన్నచర్లలో కూలిన ఇంటి పైకప్పు

త్రుటిలో తప్పిన ప్రమాదం..

గండేడ్: మండలంలోని పగిడ్యాల్‌లో గుంతల కిష్టప్ప మట్టి మిద్దె శనివారం ఉదయం కూలిపోయింది. ఆయనతోపాటు భార్య, కుమార్తె, చిన్న కుమారుడు ఇంట్లో ముందుభాగంలో ఉన్నారు. కిష్టప్ప భోజనం చేస్తుండగానే వెనుక వైపున ఉన్న మిద్దె ఒక్కసారిగా కూలింది. వెంటనే వారు బయటకు పరుగులు తీశారు. ఒకవేళ ఇల్లు మొత్తం కూలి ఉంటే ప్రాణ నష్టం జరిగేది. ఆందోళనతో కిష్టప్ప అస్వస్థతకు గురికాగా చికిత్స నిమిత్తం కోస్గి ఆస్పత్రికి తరలించారు.

రైతుల పొలాల్లోకి కాలుష్య జలం


సెజ్‌లోని ఆమ్నిల్ పరిశ్రమల ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

- పరిశ్రమల ఎదుట ఆందోళన చేపట్టిన రైతులు
- ఈ వ్యవహారంపై జడ్చర్ల ఎమ్మెల్యే ఆరా
- రైతులకు మద్దతు పలికిన నాయకులు

రాజాపూర్: కురుస్తున్న ముసురు వర్షం కాలుష్యం జలాలను రైతుల పొలాల్లోకి వదిలేందుకు వారికి అనువుగా మారింది. శనివారం కురిసిన ముసురు వర్షానికి మండలంలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, జడ్చర్ల మండలం పోలేపల్లి, గుండ్లగడ్డతండా రైతుల పొలాల్లోకి వర్షం మాటున పెద్ద ఎత్తున సెజ్‌లోని ఆమ్నిల్, శిల్ప, ఎవర్‌టోజన్ తదితర పరిశ్రమల నుంచి కాలుష్యం జలాలు వదిలారు. దీంతో కాలుష్యం జలాలు ఒక పెద్ద వాగును తలపిస్తూ.. రైతుల పొలాల్లోకి వస్తుండటంతో వరదనీటికి టీఎస్ఐఐసీ నిర్మించిన ప్రహరీ సైతం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరైనా ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేది. వరదలా తమ పొలాల్లోకి కాలుష్యం జలాలు వస్తుండటంతో చుట్టుపక్కల రైతులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వర్షంలోనే ఆమ్నిల్, శిల్ప పరిశ్రమల గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొండ్లపల్లి కృష్ణయ్యకు ఎమ్మెల్యే సూచించడంతో రైతుల పొలాల్లోకి వస్తున్న కాలుష్యం జలాలను చూసి రైతులు చేస్తున్న ఆందోళనకు వారు మద్దతు పలికారు. అంతే కాకుండా ఇంతపెద్ద ఎత్తున రైతుల పొలాల్లోకి కాలుష్యపు జలాలు వదులుతున్న విషయాన్ని ఎమ్మెల్యే సంబంధిత పీసీబీ ఈఈ సురేష్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. రైతులకు నష్టం కల్గించే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజలకు ఉపాధి ఇచ్చే పరిశ్రమలు ఉండాలి కాని, ప్రజలను, దేశానికి అన్నంపెట్టే రైతులకు నష్టం కల్గిసే ఊరుకునే పరిస్థితి లేదన్నారు. కృష్ణయ్య, లింగం, బుడ్డయ్య, మల్లేష్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


రైతుల పొలాల్లోకి వదులుతున్న కాలుష్యపు జలాలను చూయిస్తున్న రైతులు, నాయకులు